




# కరపత్రం

SINCE 2014

మంగళవారం మే 13 2025 | సంపుటి :0 | సంచిక :210 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్

## రంగాల్లో జీసీసీ హబ్‌గా హైదరాబాద్:

**సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.**




- కొత్తగా 3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మరియు లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించబడ్డాయని ఆయన తెలియజేశారు.
- మరిన్ని ప్రపంచ స్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది.
- రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన మరియు సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని ఆయన వివరించారు.
- ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి అందరి సహకారం ఆయన కోరారు.
- ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించినట్లు చెప్పారు. మరిన్ని ప్రపంచస్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని వివరించారు. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో అందరి సహకారం కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వ అప్పులు,

## వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారని చెప్పారు.

2లో

- టీజీఐఐసీలో 1.75 లక్షల ఎకరాలను కేసీఆర్ అందుబాటులో ఉంచారని చెప్పారు.
- ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని కుదువపెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు.
- టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారని ఆరోపించారు.

## మండే ఎండల్లో కూల్ కూల్ న్యూస్:4 రోజుల ముందే నైరుతి రుతుపవనాలు..



భానుడి ప్రతాపానికి అల్లల్లాడుతున్న ప్రజలకు కూల్ న్యూస్ చెప్పింది వాతావరణ శాఖ. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు 4 రోజులు ముందుగానే రానున్నాయని వెల్లడించింది వాతావరణ శాఖ. నైరుతి రుతుపవనాలు మంగళవారం ( మే 13 ) అండమాన్ తీరాన్ని తాకనున్నాయని..

2లో


## మా అమ్మ దుర్గామాత ఫోటో పక్కన ఇందిరాగాంధీ ఫోటో పెట్టి పూజించేది: జగ్గారెడ్డి



2లో

దివంగత ఇందిరాగాంధీపై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ప్రశంసలు కురిపించారు. తమ ఇంట్లో దుర్గా మాత ఫోటో పక్కన ఇందిరా గాంధీ ఫోటో పెట్టి అమ్మ పూజించేదన్నారు. గొప్ప కోసం కాదు..

## ఆర్టీఐ కమిషనర్లను నియమించిన తెలంగాణ ప్రభుత్వం




హైదరాబాద్: సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ) కమిషనర్లుగా నలుగురిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఆర్టీఐ కమిషనర్లుగా పీవీ శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆపరేషన్ సిందూర్..

## జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్న మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాత్రి 8గంటలకు జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు.

2లో



# విరాట్ కోహ్లీ.. లక్షల మందికి స్ఫూర్తి:



**రిటైర్మెంట్‌పై తెలుగు రాష్ట్రాల సీఎంల స్పందన**

టెస్టు క్రికెట్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వీడ్కోలు పలకడంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి స్పందించారు.





హైదరాబాద్: టెస్టు క్రికెట్‌కు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వీడ్కోలు పలకడంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆయన నాయకత్వ లక్షణాలు లక్షల మందికి స్ఫూర్తినిచ్చాయని కొనియాడారు. మిగతా ఫార్మాట్లలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**అద్భుత అధ్యాయం ముగిసింది: చంద్రబాబు**

టెస్టు క్రికెట్ నుంచి విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌తో భారత క్రీడా చరిత్రలో ఓ అద్భుత అధ్యాయం ముగిసిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. క్రికెట్‌లో అతడి అభిరుచి, క్రమశిక్షణ చాలా మందిలో స్ఫూర్తిని నింపాయన్నారు. విరాట్ కోహ్లీ దేశానికే గర్వకారణమని, అతడి తదుపరి ప్రయాణం.. విజయపథంలో సాగాలని ఆకాంక్షించారు.

**విరాట్ పేరు చరిత్రలో నిలిచిపోతుంది: రేవంత్ రెడ్డి**

భారత క్రికెట్ చరిత్రలో 'విరాట్ కోహ్లీ' ఒక గొప్ప పేరుగా నిలిచిపోతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అద్భుతమైన క్రీడా వారసత్వాన్ని కొనసాగించాడని ప్రశంసించారు. అనేక రికార్డులు సృష్టించి, అత్యంత క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్నాడని, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. టెస్టు క్రికెట్ నుంచి వైదొలగుతున్నందున.. మిగతా ఫార్మాట్లలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రాకెట్‌లా దూసుకెళ్లిన సూచీలు..

## మదుపర్ల సంపద 16 లక్షల కోట్లు పైకి

2లో



# తొలి రోజుల బాపు

"నువ్వు ఎంచుకున్న రంగంలో రోజుకి ఒక గంట పాటు సాధన చేస్తే చాలు, మూడేళ్ళల్లో ఆ రంగంలో మంచి స్థానంలో ఉంటావు. ఐదేళ్ళలోపు ఆ రంగంలో దేశం మొత్తమ్మీద నీదే అథారిటీ. ఏడేళ్ళలోకల్లా ప్రపంచం మొత్తమ్మీద ఆ రంగంలోని ప్రముఖుల్లో నువ్వూ ఒకడివి అవుతావు"

ఈ విషయం 'బాపు'గా ప్రసిద్ధులైన సత్తిరాజు లక్ష్మీనారాయణ (1933%-%2014)కు సంబంధించి వందశాతమూ నిజం! బి.కామ్, ఎల్.ఎల్.బి. చేసి మద్రాసులో అడ్వకేట్‌గా ఎన్‌రోల్ ఐనాబీ తర్వాత దశలో తెలుగు, హిందీ సినిమా దర్శకుడిగా రాణించినా%-% బాపు స్థూలంగా చిత్రకారుడు. తొలి దశలో గంటల తరబడి కృషి చేయడం వల్లనే 'బాల', 'గృహలక్ష్మి', 'ఆనందవాణి', 'పారిజాతం', 'చిత్రగుప్త', 'తెలుగు స్వతంత్ర' ఇత్యాది పత్రికల ద్వారా ప్రతిభ చూపి 1959 కల్లా 'ఆంధ్ర సచిత్ర వార పత్రిక'లో ప్రవేశించారు. అప్పటికి ఆయన వయసు 26ఏళ్ళ మాత్రమే. నిజానికి ఆయన బొమ్మలు 1945%-%47 నుంచే పాఠకులకు తెలుసు. ఆంధ్ర పత్రిక వీక్లీ 1960 ఆగస్టు 24 సంచికలో తోటపల్లి నుంచి టి.హెచ్. కృష్ణ అనే పాఠకుడు "కడచిన రెండు సంచికలలో బాపు బొమ్మలు వేయలేదు" అని రాయగా "బాపు చిత్రాలు ప్రచురించని సంచిక ఇంతవరకు వెలవరించలేదు గమనించమని కోరిక" అని ఆ పత్రిక జవాబుగా ప్రచురించింది. అలా మొదలైన బాపు బొమ్మలు, కార్టూన్లు, కథలకు ఇలస్ట్రేషన్లు, పుస్తకాలకు ముఖచిత్రాలతో 2012%-%13 దాకా, అంటే అరశతాబ్దం మించి కొనసాగాయి. 1955 లో ఆంధ్ర సచిత్ర వారపత్రిక సైజుతో సహా కంటెంట్ సంబంధించి పెద్ద స్థాయిలో మార్పులు జరిగాయి. 'కాంచన ద్వీపం', '80 రోజుల్లో భూప్రదక్షిణం', 'రాజు%-%పేద', 'రెండు నగరాలు' వంటి అత్యుత్తమ అనువాద నవలలతో పాటు 'తెలుగు వెలుగులు' వంటి శీర్షిక, సినిమా కబుర్లు, రాష్ట్ర రాజకీయాలు.. ఇలా తెలుగు వీక్లీలకు ఒక మోడ్యూలు తయారయ్యింది. ఆ సక్సెస్ ఫార్ములాలో ఎంతోమంది ప్రఖ్యాతుల రచనలతో పాటు, బాపు బొమ్మలూ అంతర్భాగం.

1962 ఆగస్టు 3 సంచికలో ఆంధ్ర పత్రిక వీక్లీ బాపు గురించి ఒక పూర్తి పేజీ వ్యాసం ప్రచురిస్తూ 'రాజు%-%రైతు', 'బంగారం%-%సింగారం', 'బుడుగు', 'మనవాళ్లు' వంటి బొమ్మల సిరీస్‌లు ప్రఖ్యాతమైనవనీబీ అప్పటికే రేఖ, శేషు, రంగ అనే పేర్లతో కూడా బాపు బొమ్మలేశారని పేర్కొన్నారు. ఇప్పుడైతే దాచుకోవడానికి సాంకేతిక విజ్ఞానపరమైన సౌలభ్యాలు చాలా ఉన్నాయి కానీ అప్పట్లో అంత సదుపాయంగా ఉండేది కాదు. కనుక బాపు వంటి ఆర్టిస్టు విస్తృతంగా చిత్రించిన కళాఖండాలు చూడాలంటే ఇప్పుడు కష్టమే.

1962 దాకా ఆయన వేసిన బొమ్మలు 'బాపు ఆర్ట్ కలెక్షన్ డాట్ కామ్' లో లభ్యమౌతున్నాయి. ఆంధ్ర పత్రిక వీక్లీలో పలు రకాలుగా, పలు సైజుల్లో బాపు వేసిన బొమ్మలను సేకరించడం, పునర్ముద్రించడం కొంత కష్టమైన వ్యవహారమే. వారి కుటుంబ సభ్యులు రంగారావు సారథ్యంలో ఇటీవల కొన్ని అమూల్యమైన సంకలనాలు ప్రచురించారు. అందులో మొదటిది 'ఎప్పుడూ ఇంతే' పేరున 210 పేజీలతో వచ్చింది. ఇందులో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 1959 సెప్టెంబర్ 23 నుంచి 1962 జూన్ 29 సంచిక వరకు వెలువడిన బాపు, అలాగే వారి తమ్ముడు శంకర్ (శంకర నారాయణ) బొమ్మలు ఉన్నాయి.

ఇందులో ప్రచురించిన 125 'ఎప్పుడూ ఇంతే' కార్టూన్లు శంకర్ పేరుతో ఉన్నా కేవలం కొన్ని వారాలు మాత్రమే శంకరనారాయణ వేశారు, మిగతా అన్నీ బాపు వేసినవే. సంకలనంలో కొన్ని పేజీలలో చందమామలో వేసిన కార్టూన్లు కూడా జోడించారు. ఈ బొమ్మలను జాగ్రత్తగా గమనిస్తే బాపు ఎంతగా చదివారో, ఎంతగా కష్టపడి సాధన చేశారో సులువుగా బోధపడుతుంది. అదే సమయంలో సామర్థ్యం ఉండి, సాధన చేయగలిగిన కళాకారుడికి ఊతంగా సంస్థలు ఎలా దోహదపడగలవో కూడా అర్థం చేసుకోవచ్చు. కేవలం 25 నయా పైసాల ఖర్చుతో 60 పేజీల వారపత్రిక రకరకాల ప్రయోజనకరమైన అంశాలతో అందుబాటులో ఉండేది. ఇప్పుడు టెక్నాలజీ పుష్కలంగా రావడంతో కళానైపుణ్యంతో పాటు కళాకారులను కూడా పూర్వపక్షం చేసింది. ఇప్పుడు 70, 75 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ అప్పటి విషయాలు మహాద్భుతంగా స్మృతిపథంలో మెదులుతూ ఉంటాయి. ఆ ఫీల్ రావాలని బాపు కార్టూన్లున్న పేజీలను యథాతంగా స్కాన్ చేయించి ఈ పుస్తకంలో అందుబాటులోకి తెచ్చారు. చిత్రకళ, కార్టూన్లు, జర్నలిజం సంబంధించిన ధోరణుల పట్ల ఆసక్తి ఉన్నవారందరికీ ఈ సంకలనం దాచుకోదగ్గది.

## నిరంతరాయంగా ఉపగ్రహ పర్యవేక్షణ 10 భారతీయ ఉపగ్రహాలకు 24 గంటలు పని

### ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి

పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సరిహద్దుల తీరప్రాంతాన్ని పర్యవేక్షించడానికి, రక్షించడానికి 10 భారతీయ ఉపగ్రహాలు 24 గంటలు నిర్విరామంగా పనిచేస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. కీలకమైన నిఘా డేటాను అందించడం ద్వారా పౌరులను రక్షించడంలో ఈ ఉపగ్రహాలు వ్యూహాత్మక పాత్ర పోషిస్తాయని అన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ- 5వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ ప్రసంగిస్తూ ... భారతదేశపు 7,000 కిలో మీటర్ల సముద్ర తీరం, ఉత్తర భూభాగాలపై నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం గురించి వివరించారు. మన దేశ భద్రతను నిర్ధారించుకోవాలంటే, మన ఉపగ్రహాల ద్వారా సేవలందించాలన్నారు. మన సముద్ర తీర ప్రాంతాలను మనం పర్యవేక్షించాలన్నారు. మనం మొత్తం ఉత్తర భాగాన్ని నిరంతరం పర్యవేక్షించాలని నారాయణన్ అన్నారు. శాటిలైట్లు-, డ్రోన్ -టె-క్నాలజీ లేకుండా భారతదేశం పూర్తి భద్రతా కవరేజీని సాధించలేమని నారాయణన్ స్పష్టం చేశారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ముఖ్యంగా 'పొరుగువారు' ముప్పును కలిగిస్తున్నందున, రక్షణ సంసిద్ధతకు అంతరిక్ష ఆధారిత నిఘా చాలా కీలకంగా మారింది. జాతీయ భద్రతపై ఇస్రో తీసుకుంటు-న్న చర్యలను, పోషిస్తున్న కీలక పాత్రను ఆయన వివరించారు. భద్రతాపరమైన అంశాలతో పాటు- ఇస్రో ఉపగ్రహాలు వ్యవసాయం, -టె-లీ-ఎడ్యుకేషన్, -టె-లీ-మెడిసిన్, వాతావరణ అంచనాలు, పర్యావరణ పర్యవేక్షణ, ఆహార భద్రత వంటి అనేక పౌర సేవల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా విపత్తుల సమయంలో నష్టాన్ని గణనీయంగా తగ్గించడంలో ఉపగ్రహాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. గతంలో విపత్తుల వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోతే నేడు ఆ పరిస్థితి లేదని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన ఘన విజయాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చంద్రయాన్-1 ద్వారా చంద్రుడిపై నీటి జాడలను కనుగొన్న తొలి దేశంగా భారత్ నిలిచిందని నారాయణన్ గర్వంగా ప్రకటించారు. ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను భారత్ విజయవంతంగా ప్రయోగించిందని తెలిపారు.

## మండే ఎండల్లో కూల్ కూల్ న్యూస్:4 రోజుల ముందే నైరుతి రుతుపవనాలు..

మొదటిపేజీ తరువాయి

ఆ తర్వాత మూడు రోజులు అటు ఇటుగా మే 27న కేరళాలోకి ప్రవేశించనున్నాయని తెలిపింది వాతావరణ శాఖ. గత ఏడాది మే 31న నైరుతి రుతుపవనాలు తీరాన్ని తాకుతాయని వాతావరణ శాఖ అంచనా వేయగా.. మే 30న తీరాన్ని తాకాయి.

ఈ ఏడాది ఎల్నినో పరిస్థితులు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేసింది వాతావరణ శాఖ. ఈ ఏడాది సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఏకంగా 105శాతం వర్షపాతం నమోదుకానున్నట్లు అంచనా వేసింది వాతావరణ శాఖ.

ఆరు అంశాల ఆధారంగా నైరుతి రుతుపవనాల రాకను అంచనా వేసినట్టు ఐఎండీ తెలిపింది. ఆగ్నేయ భారతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు, దక్షిణ భారతంలో ప్రీ మాన్సూన్? వర్షాలు, ఆగ్నేయ పసిఫిక్? మహాసముద్రంలో సగటు సముద్ర పీడనం, దక్షిణ చైనా సముద్రంలో రేడియేషన్? తగ్గుదల, ఈశాన్య హిందూ మహాసముద్రంలో గాలులు, ఇండోనేసియా రీజియన్?లోని గాలుల ప్రభావం ఆధారంగా నైరుతి రుతుపవనాల ప్రవేశాన్ని అంచనా వేసినట్టు తెలిపింది.

గత ఐదేండ్లు అంచనాలకు అనుగుణంగా నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయని తెలిపింది. 2020లో జూన్? 5న ఎంటరవుతాయని అంచనా వేయగా.. అంతకన్నా నాలుగు రోజుల ముందుగానే జూన్? 1న ప్రవేశించాయని వెల్లడించింది. 2023లో జూన్? 4న వస్తాయని అంచనా వేస్తే జూన్? 8న, 2024లో మే 31న కేరళలోకి ఎంటరవుతాయని ఫోర్?కాస్ట్? ఇస్తే మే 30న రుతుపవనాలు ప్రవేశించాయని ఐఎండీ వెల్లడించింది.

## మా అమ్మ దుర్గామాత ఫోటో పక్కన ఇందిరాగాంధీ ఫోటో పెట్టి పూజించేది: జగ్గారెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఇవన్నీ నిజాలే కాబట్టి చెబుతున్నానన్నారు. ఇందిరాగాంధీనీ అటల్ బిహార్ వాజ్ పేయి కూడా అపర కాళీ అని ప్రశంసించారని అన్నారు.

గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి. 1971 లో పాకిస్తాన్..భారత్ కి యుద్ధం జరిగింది. అప్పుడు ప్రధాని ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలు ధైర్యాన్ని యావత్ ప్రపంచం మెచ్చుకుంది. ఇందిరా గాంధీ యుద్ధం చేసే సమయంలో కూడా ప్రతిపక్షంతో విమర్శలేకుండా చేశారు. ఈ మధ్య పాకిస్తాన్ ఇండియా మధ్య యుద్ధం జరుగుతుంటే ఇందిరా గాంధీ గుర్తొచ్చారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరాగాంధీ నిర్ణయాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. అమెరికా అప్పట్లో కూడా యుద్ధం ఆపాలని చూసింది.. కానీ ఇందిరాగాంధీ ఊరుకోలేదు . భారత దేశ ప్రజల నిర్ణయంలో తలదూర్చొద్దు అని బాహాటంగానే ఇందిరా గాంధీ చెప్పారు. తప్పని పరిస్థితిలో పాకిస్తాన్ ప్రధాని తల వంచారు.

1971 లో ఇండియాకి పాకిస్తాన్ తలవంచింది. పార్లమెంట్ లో రాజకీయాలకు అతీతంగా వాజ్ పేయి ఇందిరా గాంధీని పొగిడారు. కులమతాలకు అతీతంగా అందరూ ఆమెను అభినందించారు. ఇందిరా గాంధీ వస్తున్నారు అంటే మూడు రోజుల ముందే సభ పెట్టే స్థలంలో ప్రజలు ఉండే వారు. నేను చిన్నగా ఉన్నప్పుడు ఆర్ఎస్ఎస్ శాఖకి పోయేవాన్ని. మా ఇంట్లో మా అమ్మ దుర్గా మాత ఫోటో పక్కన ఇందిరా గాంధీ ఫోటో పెట్టి పూజించేది. గొప్ప కోసం కాదు..నిజాలు కాబట్టి చెప్తున్నా అని అన్నారు.

## ముగిసిన భారత్- పాకిస్థాన్ డీజీఎంవోల చర్చలు



భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరుదేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)ల చర్చలు ముగిశాయి. హాట్‌లైన్ ద్వారా జరిగిన ఈ చర్చల్లో భారత డీజీఎంవో లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, పాకిస్థాన్ డీజీఎంవో మేజర్ జనరల్ కాశిఫ్ చౌదరి పాల్గొన్నారు. వాస్తవానికి మధ్యాహ్నం 12 గంటలకే చర్చలు జరగాల్సి ఉండగా.. సాయంత్రానికి వాయిదా పడ్డాయి. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తతల తగ్గింపు, పీవోకే తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్, పాక్ సైన్యం కవ్వింపులు తదితర పరిణామాలతో ఇటీవల ఇరుదేశాల నడుమ ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మే 10న ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి.

## కిరానా హిల్స్‌ను టార్గెట్ చేయలేదు.. పాక్ గురించి ఆ విషయం చెప్పినందుకు థ్యాంక్స్




ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత సైన్యం పాకిస్థాన్‌లోని కిరానా హిల్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏకే భారతి వెల్లడించారు. పాకిస్థాన్‌లోని అణుస్థావరాన్ని భారత్ లక్ష్యంగా చేసుకున్నట్లు జరుగుతోన్న ప్రచారాన్ని తోసిపుచ్చారు. ఆపరేషన్ సిందూర్‌పై త్రివిధ దళాల అధికారులు నిర్వహించిన సమావేశంలో ఈ అసత్య ప్రచారంపై స్పష్టత ఇచ్చారు.

"పాకిస్థాన్ తన అణ్వాయుధాలను కిరానా హిల్స్ వద్ద నిల్వ చేస్తుందని చెప్పినందుకు థ్యాంక్స్. అక్కడ ఏమైనా ఉండనీ.. మేం మాత్రం ఆ హిల్స్‌ను టార్గెట్ చేయలేదు. మేం లక్ష్యంగా చేసుకున్నామని చెప్పిన జాబితాలో అది లేదు" అని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ అణు స్థావరంపై దాడి గురించి అనేక వార్తలు చక్కర్లు కొట్టాయి. అణ్వాయుధాలను నిల్వచేసి ఉండొచ్చని చెప్తున్న హిల్స్.. సర్గోధా వైమానిక స్థావరానికి దగ్గర ఉన్నాయని వాటి సారాంశం. ఆ వైమానిక స్థావరాన్ని భారత్ టార్గెట్ చేసినట్లు మన సైన్యం ధ్రువీకరించగానే ఆ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. పాక్‌లో ఇటీవల సంభవించిన భూకంపాలకు.. అణు నిల్వలు ఉంచిన ప్రదేశాన్ని ఢీకొట్టడానికి ముడిపెట్టిన సిద్ధాంతాలు చక్కర్లు కొట్టాయి. వీటన్నింటికి తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఏకే భారతి చెక్ పెట్టారు.

పాకిస్థాన్ సేనలు ఉగ్రవాదులకు అండగా నిలిచాయని, ఈ పోరాటాన్ని తమ పోరాటంగా మలచుకున్నాయని పేర్కొన్నారు. దీంతో భారత సైన్యం దీటుగా జవాబు ఇచ్చిందని చెప్పారు. పాకిస్థాన్ సైన్యానికి ఏదైనా నష్టం వాటిల్లితే దానికి వారే బాధ్యులని స్పష్టం చేశారు. పాకిస్థాన్ దాడుల సమయంలో భారత గగనతల రక్షణ వ్యవస్థలు శత్రుదుర్భేద్యంగా నిలిచాయని, దాయాది ఆటలు సాగనివ్వలేదన్నారు. అనంతరం పాక్‌లోని నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను ప్రదర్శించారు.

## రాష్ట్ర ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎమ్మెల్సీ కవిత

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుత ప్రభుత్వం ఆ భూమిని కుదువపెట్టాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రహస్య జీవో ఇచ్చారని ఆరోపించారు. అన్ని భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కుదువపెట్టేలా జీవో తీసుకొచ్చారన్నారు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములను కుదువ పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు.

"టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారిస్తే ఎందుకు దాచారో సీఎం జవాబివ్వాలి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టాక 1.75 లక్షల ఎకరాలకు ఎవరిది బాధ్యత? నిపుణుల సిఫార్సు లేకుండా చేస్తే జీవోను ఉపసంహరించుకోవాలి. భూములు కుదువ పెట్టి.. వచ్చిన డబ్బు పక్కదారి పట్టించడమే ఈ ప్రభుత్వ లక్ష్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.1.80 లక్షల కోట్ల అప్పులు చేసింది. రూ.80 వేల కోట్లు మాత్రమే అప్పులు, వడ్డీల కోసం చెల్లించారు. మిగిలిన రూ.లక్ష కోట్లు ఎక్కడికి పోయాయి? ప్రభుత్వ అప్పులు, వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం..

నేను పార్టీ బలోపేతం కోసమే పని చేస్తున్నా. 47 నియోజకవర్గాల్లో పర్యటనలో వచ్చిన అభిప్రాయాలే చెబుతున్నా. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. పార్టీలో నాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.. అది సరికాదు. సమయం వస్తే అన్నీ బయటకు వస్తాయి. నన్ను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తాను. నాపై దుష్ప్రచారం విషయంలో పార్టీ స్పందిస్తుందని భావిస్తున్నా" అని కవిత తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్.. జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్న మోదీ

మొదటిపేజీ తరువాయి

భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. పాక్‌స్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', ఇరుదేశాలు చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ప్రధాని మొదటిసారిగా సోమవారం రాత్రి 8గంటలకు జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, పాక్‌తో కాల్పుల విరమణకు అంగీకారం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రధాని ప్రసంగం పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పహల్గాంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26మంది మృతిచెందిన ఘటన యావత్ ప్రపంచాన్ని కలచివేసిన విషయం తెలిసిందే. ఈ దాడులకు ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'తో పేరిట భారత సైన్యం పీవోకేలోని ఉగ్ర శిబిరాలపై దాడులు జరిపింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయగా.. 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తర్వాత మే 8, 9, 10 తేదీల్లో పాకిస్థాన్.. భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌లు, క్షిపణి దాడులకు విఫలయత్నం చేయగా.. దాయాది కుట్రలను భారత సైన్యం వీరోచితంగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో 35 నుంచి 40మంది పాక్ సైనికుల్ని మట్టుబెట్టింది.

ఈ క్రమంలో ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. యుద్ధ వాతావరణం నెలకొనడంతో అమెరికా సహా పలు దేశాలు భారత్- పాక్ నడుమ మధ్యవర్తిత్వానికి ప్రయత్నించాయి. ఇందులో భాగంగా సరిహద్దుల్లో కాల్పుల నిలిపివేతకు ఇరు దేశాలూ అంగీకరించడంతో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది. ఈ ఒప్పందం, అనంతర పరిస్థితిపై ఇరుదేశాల మధ్య సోమవారం మధ్యాహ్నమే 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)ల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. తాజాగా 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైనట్లు రక్షణశాఖ అధికారులు ప్రకటించిన వేళ మోదీ ప్రసంగం ప్రకటన వెలువడటం గమనార్హం.

## రాకెట్‌లా దూసుకెళ్లిన సూచీలు.. మదుపర్ల సంపద 16 లక్షల కోట్లు పైకి

మొదటిపేజీ తరువాయి



ముంబయి: భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఖరారైన నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. అమెరికా- చైనా వాణిజ్య చర్చలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి వంటి అంతర్జాతీయ అంశాలు ఇందుకు తోడయ్యాయి. దీంతో మన సూచీలు ఆకాశమే హద్దుగా పైకెగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 3 వేలకు పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. 2024 డిసెంబర్ 16 తర్వాత బెంచ్ మార్క్ సూచీలు ఈ స్థాయిని అందుకోవడం ఇదే తొలిసారి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.16 లక్షల కోట్ల మేర పెరిగి రూ.432 లక్షల కోట్లకు చేరింది.

### టారిఫ్ వార్‌కు బ్రేక్.. 90 రోజుల వాయిదాకు అమెరికా, చైనా ఓకే

భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారిన వేళ సెన్సెక్స్ ఆరంభంలోనే 80,803.80 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,454.47) భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే దూకుడు కొనసాగించింది. ఇంట్రాడేలో 3 వేల పాయింట్లకు పైగా లాభంతో 82,495.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2975.43 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 916.70 పాయింట్ల లాభంతో 24,924.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువగా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా మిగిలిన షేర్లు లాభాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65 డాలర్లు, బంగారం ఔన్సు 3222 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే ముగిశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6.70 శాతం మేర లాభపడింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కరోజులో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు కూడా 4 శాతం మేర రాణించాయి.

మార్కెట్ల ర్యాలీకి కారణాలివే..

భారత్-పాకిస్థాన్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కాస్త తగ్గడం మదుపర్ల సెంటిమెంట్‌ను బలపర్చింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య వివాదాన్ని తగ్గించే లక్ష్యంతో అమెరికా-చైనా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ముగిశాయి. ఇరు దేశాలు తమ తమ టారిఫ్‌లను 115 శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. 90 రోజుల పాటు ఇవి అమల్లో ఉంటాయి.

భౌగోళిక అనిశ్చితులు సద్దుమణిగిన నేపథ్యంలో రియల్టీ, మెటల్, ఆటో షేర్లు రాణించాయి. మన మార్కెట్లు భారీగా పెరగడంలో ఇవి దోహదపడ్డాయి.

భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వేళ కూడా విదేశీ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు మన ఈక్విటీ మార్కెట్‌లో కొనసాగాయి. ఇవి పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి.

# భారత సైనిక త్రివిధ దళాలకు మద్దతుగా క్షేమార్థం జమ్మికుంట శివాలయంలో ప్రత్యేక పూజలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 12**
జమ్మికుంట అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మనదేశంలోని త్రివిధ దళాలకు మద్దతుగా మరియు క్షేమార్థం కోసం భగవద్ అనుగ్రహం కొరకు జమ్మికుంట లోని శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో అనగా సోమవారం రోజున పౌర్ణమి సందర్భంగా 108 లీటర్ల ఆవుపాలతో మరియు 108 కొబ్బరికాయలతో ఆలయ అర్చకులు మండలేముల వేణుగోపాల్ శర్మ ప్రత్యేక పూజలు అభిషేకాలు అన్నపూర్ణ సేవా సమితి మరియు భక్తుల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది యుద్ధం కాదని ధర్మం కోసం దేశ గౌరవం కోసం పోరాటమని మన ఐక్యత మన దేశభక్తి ప్రపంచానికి తెలియజేయాలని అన్నారు పాకిస్తాన్ కు భారతదేశం ఏంటో స్పష్టంగా చెప్పే సమయం వచ్చిందని భారత్ ఏకమైతే ఎంత శక్తివంతమైందో చూపే సమయం ఇదని అందుకే మన త్రివిధ దళాల సైనికులకు శ్రీ విశ్వేశ్వర స్వామి వారి పరిపూర్ణమైన అనుగ్రహం కలిగి మరింత శక్తి యుక్తులను వారికి ప్రసాదించి ఉగ్రమూకులను తుద ముట్టించి భారతదేశం విజయపతానికి దూసుకెళ్లాలని ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని ఆ విశ్వేశ్వర స్వామిని వేడుకున్నాము ఈ కార్యక్రమంలో జమ్మికుంటకు చెందిన పుర ప్రముఖులు అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు భవాని భజన మండలి భక్తులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు

# శ్రీ దుర్గా అమ్మవారి ఆలయంలో లక్ష మల్లెల పుష్పార్చన



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
సింగరేణి అధికారుల నివాసం బంగ్లోస్ ఏరియాలోని నెలకొన్న శ్రీ దుర్గా అమ్మవారి ఆలయంలో వైశాఖ శుద్ధ పౌర్ణమిని సందర్భముగా లక్ష మల్లెల పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్జీ-1 సేవా సమితి అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆపరేషన్ సతీమణి మాలతి సూర్యనారాయణ, డైరెక్టర్ పి.పి సతీమణి విజయ వెంకటేశ్వర్లు, ఆర్జీ, 1,2, 3 అడ్రియాల జనరల్ మేనేజర్ల సతీమణులు, ఆలయ కమిటి సభ్యులు, లేడిస్ క్లబ్ సభ్యులు పుష్పర్చన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో లక్ష్మి అష్టోత్తర సహస్ర నామ పూజలు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఈ సందర్బంగా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ ప్రతి ఏడాది వైశాఖ మాసంలో వచ్చు పౌర్ణమికి గొప్ప విశిష్ఠత కలదని అమ్మవారిని పూలతో పూజించడం వలన ఆయురారోగ్యాలతో సకల సౌభాగ్యములు కలుగుతాయని ప్రకృతి వైపరిత్యాలు తొలగిపోయి అందరు సుఖసంతోషాలతో విలసిల్లుతారని ప్రకృతి సస్యశ్యామలంగా ఉండి పాడి పంటలతో అభివృద్ధి చెందెందుకు ఈ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు తీర్థ ప్రసాదములు అన్నధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఏరియాల జనరల్ మేనేజర్లు లలిత్ కుమార్, బైద్య, వారి సతిమణులు ఉమా, సుధా, లలిత, సునీత, అలివేణి, కృష్ణ, సోనాలి, నిర్మల తదితరులు పాల్గోన్నారు.

## నిగనిగలాడే మామిడి పండ్లు.. లోపల కాలకూట విషం..! అలాగే తిన్నారంటే అంతే సంగతులు..!

ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తూ కృత్రిమ పద్ధతిలో మామిడి పండ్లను మగ్గ పెడుతున్న గోదాంలపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు,జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.హైదరాబాద్ పాతబస్తీ, మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సలీమ్ నగర్, శాలి వాహన నగర్ లలో గోదాములపై దాడి చేశారు . సలీమ్ నగర్ గోదాంలో సుమారు రూ.60 వేలు.శాలివాహన నగర్ లో రూ.3.50 లక్షల విలువ గల పండ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లను గోదాంలుగా ఉపయోగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా పండ్లను మాగ పెట్టేందుకు ఎథిలైన్, కాల్షియం కార్బైడ్, కాల్షియం ఎసిటిలైడ్ వంటి కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు.నిబంధనలకు విరుద్ధంగా కెమికల్స్ వాడటం వల్ల ప్రజలకు చర్మ, ఊపిరితిత్తులు.. తదితర ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కాల్షియం కార్బైడ్ ఇది నిషేధిత పదార్థం. కానీ పండ్ల వ్యాపారులు మాత్రం 15 కిలోల మామిడికాయలు పండ్లుగా మారేందుకు కాల్షియం కార్బైడ్‌కు సంబంధించి చిన్న సాషెట్‌ను సబ్బు పెట్టెల్లో పెట్టి మగ్గిస్తున్నారు. దీంతో 3,4 రోజుల్లో జరిగే మగ్గింపు ప్రక్రియ కేవలం 1 రోజులోనే పూర్తవుతుంది. ఇదే వ్యాపారులకు దురాశను కలిగించింది.ఈ దాడుల్లో మొత్తం రూ.4.10 లక్షల విలువ చేసే మామిడి పండ్ల ను .ఇద్దరి వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు..ఈ కేసు ను తదుపరి విచారణ నిమిత్తం మలక్ పేట పోలీసులకు అప్పగించారు..

# ప్రపంచవ్యాప్తంగా గౌతమ బుద్ధుడి బోధనలు ఆచరణ





- బౌద్ధ క్షేత్రం వరకు తారు రోడ్డు నిర్మాణానికి కృషి:
- గౌతమ బుద్ధ జయంతి మహోత్సవంలో...
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు:

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
ప్రపంచవ్యాప్తంగా గౌతమ బుద్ధుడి బోధనలు ఆచరణ సాధ్యం అని,బౌద్ధ క్షేత్రం వరకు తారు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని, గౌతమ బుద్ధ జయంతి మహోత్సవంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు అన్నారు. సోమవారం రోజున ఎలిగేడు మండలంలోని దూళికట్ట బౌద్ధ క్షేత్రంలో 2569 గౌతమ బుద్ధ పూర్ణిమ మహోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు హాజరైనారు.

**ఈ సందర్బంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...**

గౌతమ బుద్ధుడి ఆలోచన విధానాన్ని ఆచరించడం అభినందనీయమని ,వారి ఆశయాలు నేడు ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్నాయని అన్నారు. బుద్ధ క్షేత్రానికి రావడానికి రహదారి సరిగా లేదని తెలిపారని,రానున్న రోజులో తారు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బుద్ధపూర్ణిమ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దేవా శ్రీనివాస్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నేత్ర, అవయవ, శరీర, దాతల సంఘం సహకారంతో తన మరణానంతరం అవయము దానం చేస్తానని ముందుకు రావడంతో వారికి అవయదన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ మత సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీకి విద్యాశాఖ అధికారుల వత్తాసు

- ప్రైవేట్ పాఠశాలలకు తొత్తుగా వ్యవహరిస్తున్న ఎంఈఓ ను సస్పెండ్ చేయాలి
- శ్రీకాకతీయ పాఠశాల బోర్డు పెట్టకుండా మరో పాఠశాల పేరుతో అడ్మిషన్లు చేస్తున్న యాజమాన్యం
- ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్




**కరపత్రం ప్రతినిధి మే 12**
హుజురాబాద్ పట్టణ కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నాయని, అక్షరాలతో లక్షల రూపాయలు చేస్తూ ఇష్టానుసారంగా ప్రకటన లు ప్రచారం చేస్తున్న విద్యాశాఖ పట్టించుకోవడంలేదని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడి అరికట్టకుండ వారికి వత్తాసు పలుకుతూ వారు చేస్తున్న విద్యా వ్యాపారానికి సహకరిస్తున్న మండల విద్యాశాఖఅధికారిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్ డిమాండ్ చేశారు. సోమవారం హుజురాబాద్ లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొనీటి పాఠశాలలు ఫీజుల పేరిట విద్య వ్యాపారం చేస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని డీఈఓ ఎంఈఓల్ల అండదండలతోనే ప్రైవేట్ పాఠశాలల వారు ఇష్టానుసారంగా ఫీజుల వసూలు చేస్తున్నారని అన్నారు. అడ్మిషన్ ఫీజు స్కూల్ ఫీ. యూనిఫామ్ ఫీ పుస్తకాలు స్టేషనరీ పేరట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ప్రైవేట్ పాఠశాలలు ఎక్కడ కూడా విద్యాశాఖ నిబందలు పాలించడం లేదని మౌలిక వసతులు లేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయని నిబంధనలు విరుద్ధంగా తోక పేర్లు అయిన ఇంటర్నేషనల్, వరల్డ్, ఈ టెక్నోటెక్నో కరికులం అంటూ ప్రచారం చేస్తున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా రెగ్యులేశన్ కమిటీ ఏర్పాటు చేసి ఫీజుల దోపిడి అరికట్టాలని పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు, సిబ్బందికి సరైన జీతాలు ఇవ్వడం లేదని విద్యాశాఖాధికారి వారికి అన్ని విధాలా సహకరిస్తున్నారని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఏజెంట్ ల వ్యవహరిస్తున్న డీఈఓను సస్పెండ్ చేసి కలెక్టర్ జిల్లాలో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రోహిత్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రాధకృష్ణ, శివ, మహేష్, అరుణ్, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం నియోజకవర్గం లో అభివృద్ధి పనులకై రూ.3 కోట్లు:

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్:**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
రామగుండం నియోజకవర్గం లో అభివృద్ధి పనులకై రూ.3 కోట్లు మంజూరు ఐనట్లు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వెల్లడించారు.
ఈమేరకు సోమవారం రోజున హైదరాబాద్లోని సచివాలయంలో రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కలిసి రామగుండం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయించాలని కోరగా, సానుకూలంగా స్పందించిన మంత్రి ఆ పనులకై దాదాపుగా 3కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది.





**ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ....**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలోని రాజీవ్ రహదారిపై సిమ్స్ కాలేజీనీ దాని అనుబంధ గల జిజిహెచ్ ఆసుపత్రీనీ కలుపుతూ
ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సిమ్స్ కాలేజీ ముందర అందమైన ముఖద్వారాన్ని నిర్మించుటకై దాదాపుగా రూ.3 కోట్ల రూపాయలు అవసరమవగా, సంబంధిత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని కలిసి ఆ పనుల గురించి తెలుపగా, వెంటనే సానుకూలంగా స్పందించి డబ్బులు కేటాయించినందుకు వారికి రామగుండం నియోజకవర్గ ప్రజల పక్షాన ధన్యవాదములు తెలియజేయడం జరిగిందని, అనంతరం రోడ్లు ,భవనాలు శాఖ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి ని కలిసి పనుల గురించి తెలియజేయడం జరిగిందని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట అర్ ఎం సి ఎస్సి విభాగం అధ్యక్షులు తాళ్లపెల్లి యుగేందర్ తదితరులున్నారు..

# ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్ రావు హఠాన్మరణం

## -సంతాపం తెలియజేసిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ

**కరపత్రం ప్రతినిధి మే 12**
ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐ ఎఫ్ డబ్ల్యూ జె) జాతీయ అధ్యక్షుడు కోటంరాజు విక్రమ్ రావు హఠాన్మరణం చెందారని తెలియజేయుటకు చింతిస్తున్నాను. ఈ రోజు సోమవారం ఉదయం లక్నోలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయసు 82 సంవత్సరాలు. విక్రమ్ రావు తెలుగు వారు. చాలా కాలంగా ఢిల్లీ, లక్నోల్లో వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా, ఎడిటర్ గా పనిచేసిన ఆయన ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో స్థిరపడ్డారు. జర్నలిస్టుల హక్కుల కోసం ఆయన దాదాపు నాలుగు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడిగా నాలుగు పర్యాయాలు పని చేసిన ఆయన దేశవ్యాప్తంగా



జర్నలిస్టుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. 1984 నుంచి ఆరు సార్లు ఐఎఫ్ డబ్ల్యూజే కు అధ్యక్షుడుగా ఉన్నారు. ప్రస్తుతం ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడుగా కొనసాగుతున్న విక్రమ్ రావు సమాజంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై అనేక రచనలు చేశారు. నలభై ఏళ్లలో దాదాపు 200లకు పైగా పుస్తకాలు రాశారు. విక్రమ్ రావు మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం తెలియజేస్తుంది. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఐఎఫ్ డబ్ల్యూజే కు అనుబంధంగా పని చేస్తుందని, విక్రమ్ రావుతో తమకు ఇరవై ఏండ్లకు పైగా అనుబంధం ఉందని ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవిందర్ తెలిపారు. విక్రమ్ రావు మరణం జర్నలిస్టుల ఉద్యమానికి తీరని లోటని వారు పేర్కొంటూ, ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రోడ్లపై ధాన్యం పోయడం వలన యాక్సిడెంట్ అయినట్లయితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటాము- సిఐ సైదా





**గజ్వేల్ మే 12 కరపత్రం ప్రతినిధి**
రోడ్ల పై ధాన్యం కుప్పలు ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది చనిపోతున్నారని, సాధ్యమైనంత వరకు రైతులు రోడ్ల పై ధాన్యం పోయారాదని గజ్వేల్ సిఐ బి సైదా సూచించారు సోమవారం గజ్వేల్ సిఐ సైదా మీడియాతో మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక కొంతమంది గాయాలపాలు కావడం, ప్రమాదం జరిగి చనిపోతున్నారని, బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు అవి తగిలి చనిపోవడం జరుగుతుందని, ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు

## అంతర్జాతీయ నర్సుల దినోత్సవం




**గజ్వేల్ మే 12 కరపత్రం ప్రతినిధి**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి యందు సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.ఎం.వో .డాక్టర్ రాము ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సుల సేవలు చాలా ప్రధానమైనవని రోగులకు ఒక తల్లిగా ఒక చెల్లిగా ఒక అక్కగా రోగిని చీదరించుకోకుండా వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిస్వార్థ సేవతో ఆప్త మిత్రులుగా సేవలందించుటలో ఆదర్శప్రాయులని కొనియాడారు ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల డాక్టర్ డాక్టర్ అనిత డీజిఓ సూర్య ప్రకాష్ అనిస్టేసియా నర్సింగ్ సూపర్డెంట్ స్వరూప రాణి సువర్ణ ఫార్మసిస్ట్ శ్రీనివాస చారి మోహన్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ మహారాజ్ భాను హెడ్ నర్సెస్ విజయలక్ష్మి నిర్మల జగదాంబ వకుళాదేవి నర్సింగ్ ఆఫీసర్స్ రాజేశ్వరి స్వాతి, శారద ,శశికళ, షాహిన్, రాజేష్,మేరి పుష్పలతా, నజీర్. ల్యాబ్ టెక్నీషియన్ శ్రీలత, జోసఫ్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ఎక్స్రే టెక్నీషియన్ జావీద్ మరియు వైద్య సిబ్బంది పారామెడికల్ స్టాఫ్ శానిటేషన్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## కరెంట్ షాక్ తో ఆవు మృత్యువాత



**గజ్వేల్ మే 12, కరపత్రం ప్రతినిధి**
కరెంట్షాక్ కొట్టి ఆవు మృతిచెందిన ఘటన సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదిపుర్ గ్రామంలో జరిగింది సిలివేరు బిక్షపతికు చెందిన ఆవు రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్ద ఆవును మేపుతున్నాడు మేసుకుంటూ బోర్ వైర్ తగిలి కరెంట్ సాక్ కొట్టి చనిపోయింది. సర్వీస్ వైరు కింద ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, గత ఆరు సంవత్సరాల క్రితం 80,000 వేలకు ఆవును కొన్నానని రైతు రోదించాడు. తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని బిక్షపతి కోరాడు

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం
## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, మే 12 కరపత్రం ప్రతినిధి**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద రోజువారి కార్యచరణలో భాగంగా పలు సమస్యలతో వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు..అనంతరం పలు ఆహ్వానాలు, వినతిపత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు..ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడుతానన్నారు.. నియోజకవర్గంలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు ..ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు...

## వడదెబ్బతో వడ్ల కుప్పపైనే రైతు మృతి



**మహబూబాబాద్ జిల్లా మే12 కరపత్రం ప్రతినిధి**
మహబూబాబాద్ జిల్లా:పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు ఆరబోస్తూ, వడదెబ్బతో రైతు గుగులోతు కిషన్ (51)మృతి కొనుగోలు కేంద్రంలో విశ్రాంతి తీసుకోవడానికి టెంట్, నీరు లాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో వడదెబ్బకు గురై మృతి చెందిన రైతు గుగులోతు కిషన్

# అధికారం కోసం కాకుండా ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీ యే


**- సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్**




**కుత్బుల్లాపూర్, మే 12 కరపత్రం ప్రతినిధి**
ప్రజల సమస్యల కోసం ఎల్లవేళలా పోరాడేది కమ్యూనిస్టు పార్టీ నాయకులేనని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని బీరప్ప నగర్ , లెనిన్ నగర్ శాఖల మహాసభలు శాఖ కార్యదర్శి హరినాథ్ రావు, సాయిలు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీరప్ప నగర్ శాఖ కార్యదర్శిగా శ్రీనివాస్ చారి, సహాయ కార్యదర్శులుగా దక్షిణామూర్తి, శీను లెనిన్ నగర్ శాఖ కార్యదర్శిగా ఎండి యూసుఫ్, సహాయ కార్యదర్శిగా సంపత్లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ మూడు సంవత్సరాలకు ఒకసారి మహాసభలను నిర్వహించి నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీగా జరుగుతుందన్నారు. ఈ మేరకు గత మూడు సంవత్సరాల నుండి ఈ మహాసభలకు నాయకత్వం చేసిన కార్యక్రమాలు సమీక్షించుకొని రాబోవు మూడు సంవత్సరాల కాలంలో పార్టీ బలోపేతం కోసం చేయాల్సిన కార్యక్రమాలను నిర్ణయించుకొని నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేనప్పటికీ ఇల్లు లేని నిరుపేదలకు లక్షల ఎకరాల పంచిన చరిత్ర కమ్యూనిస్టు నాయకులకు ఉందన్నారు. ఇంతటి చరిత్ర ఈ రాష్ట్రంలో దేశంలో ఏ పార్టీకి లేదని అన్నారు. ప్రజల అవసరాలైనటువంటి భూమి, విద్య ఉపాధి గురించి మాట్లాడకుండా బూర్జువా వర్గాల ప్రతినిధులు అయినటువంటి పార్టీలు కులం, మతం పేరు తో ప్రజల మధ్య చర్చలు తీసుకొస్తుందని అన్నారు. రాజకీయ నాయకులు డబ్బులు మద్యం ప్రజలకు పంచి రాజకీయాలను కలుషితం చేస్తున్నాయని అన్నారు. సిపిఐ పార్టీ మాత్రం డబ్బులు మద్యం పంచకుండా నీతిగా రాజకీయాలు చేస్తున్నాను గుర్తు చేశారు. బూర్జువా పార్టీలు డబ్బులు, మద్యం, కులం పేరు ప్రస్తావించకుండా రాజకీయాలు చేయలేవని అన్నారు. యువకులు బిజెపి ఆర్ఎస్ఎస్ లు చేసే మతోన్మాద రాజకీయాల ఉచ్చులో పడవద్దు అన్నారు. పేద ప్రజలకు భూమి, విద్య, వైద్యం, ఉపాధి కొరకు ఉద్యమించే పార్టీలకు మద్దతు తెలుపాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా సమితి జిల్లా అధ్యక్షురాలు హైమావతి, పార్టీ నియోజకవర్గ కోశాధికారి సదానంద, దక్షిణామూర్తి, శ్రీనివాస్, లక్ష్మి, కమలమ్మ, వీరస్వామి, రామ్ రెడ్డి, జంబు, మోహన్, సంపత్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు....

# బిల్‌గేట్స్ రూ.9 లక్షల కోట్లు దానం..

**- ఎలన్ మస్క్‌పై సంచలన కామెంట్లు**



**ఇంటర్నేషనల్ న్యూస్ మే12 కరపత్రం ప్రతినిధి**
మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. తన సంపదలో 99 శాతాన్ని గేట్స్ ఫౌండేషన్‌కు దానం చేయబోతున్నట్టు ప్రకటించారు. ఆ సంపదతో గేట్స్ ఫౌండేషన్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను భారీ స్థాయిలో చేపట్టనున్నారు. 2045 నాటికి ఆ సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసి గేట్స్ ఫౌండేషన్‌ను పూర్తిగా మూసెయ్యాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుత లెక్కల ప్రకారం బిల్‌గేట్స్ సంపదలో 99 శాతం అంటే 107 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీ ప్రకారం 9 లక్షల కోట్ల రూపాయలు. అలాగే దాతల నుంచి విరాళాలు కూడా సేకరించి రాబోయే 20 ఏళ్లలో మరో 200 బిలియన్ డాలర్లు (రూ.16 లక్షల కోట్ల రూపాయలకు పైగా)ను కూడా ఖర్చుపెట్టబోతున్నారు. ఈ డబ్బును పూర్తిగా ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన వంటి సేవా కార్యక్రమాలకు వెచ్చించి, ఆపై సంస్థను శాశ్వతంగా మూసివేయాలని యోచిస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్‌కు ప్రపంచ కుభేరుడు అయిన వారెన్ బఫెట్ కూడా భారీగా విరాళాలు అందజేస్తుంటారు. కాగా, ప్రపంచంలో అత్యంత ధనవంతుడు, టెస్లా అధినేత ఎలన్ మస్క్ (Elon Musk)పై ఇటీవల బిల్‌గేట్స్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అమెరికా పలు పేద దేశాలకు అందించే సహాయంలో మస్క్ కోత విధించిన సంగతి తెలిసిందే. ఎలన్ మస్క్ నిర్ణయం వల్ల పేద దేశాల్లో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతోందని బిల్‌గేట్స్ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, గేట్స్ ఫౌండేషన్‌ను బిల్‌గేట్స్, మిలిందా 2000 సంవత్సరంలో స్థాపించారు. గేట్స్ ఫౌండేషన్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఛారిటబుల్ ట్రస్ట్.

# వివరణ కోసం ఫోన్ చేయగా సమాచారం ఇవ్వని ఉప్పల్ ఎమ్మార్వో

**- నిర్లజ్జగా వ్యవహరిస్తూ అక్రమ బోర్వెల్ నిర్వాహకులకు వంత పాడుతున్న ఉప్పల్ రెవెన్యూ అధికారులు**







**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**
అక్రమ బోర్వెల్ వివాదంపై ఎమ్మార్వో వాణి రెడ్డి వివరణ కోసం ఫోన్ చేయగా ఫోన్ ఎత్తకుండా ఎలాంటి వివరణ ఇవ్వకుండా బోర్వెల్ నిర్వాహకులకు కొమ్ముకాస్తున్నారు ఉప్పల్ రెవెన్యూ అధికారులు. నిత్యం ఈ ప్రాంతంలో అక్రమ బోర్వెల్స్ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిపోయి నరకయాతన అనుభవిస్తున్న ప్రజలను మరింత గోసకు గురిచేస్తూ అక్రమార్కులకు వంత పాడడం శోచనీయమంటున్నారు స్థానిక కాలనీవాసులు. ఫిర్యాదులొచ్చిన ఎలాంటి చర్యలు చేపకట్టకపోవడం దౌర్భాగ్యం. బోర్ బండిని సీజ్ చేసి కోర్టుకి అప్ప చెప్పాల్సిన అధికారులే అక్రమ బోర్వెల్ కు అండగా నిలబడడం విచారకరం అంటున్నారు భగయత్ వాసులు. ఎస్ ఎస్ కన్స్ట్రక్షన్స్ మరియు లక్ష్మీ బోర్ వెల్స్ యజమానులు కలిసి ఎలాంటి భయం లేకుండా అక్రమ బోర్వెల్ సుమారు రెండు వేల అడుగులకు పైగా వేశారంటే రెవెన్యూ అధికారుల సహకారం ఏ స్థాయిలో ఉందో మనకు అర్థమవుతుంది. వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అక్రమార్కులకు అండదండలందిస్తూ ప్రకృతి వైపరీత్యాలకు కారణం అవ్వడం అత్యంత శోచనీయం. వివరణ కూడా ఇవ్వలేని పనులు ఏమున్నాయంటూ విసుపోతున్నారు స్థానిక ప్రజలు. ఇకనైనా రెవెన్యూ అధికారులు తమ బుద్ధిని మార్చుకొని అక్రమ బోర్వెల్ నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించి చర్యలు చేపట్టాలని స్థానిక వాసులు కోరుకుంటున్నారు. ఫైన్ ల పేరుతో కాలయాపన చేయకుండా వాల్టా చట్ట ప్రకారం బోర్ వేసిన ప్రాంతాన్ని పూర్తిగా సీజ్ చేసి ప్రజలకు కొంతైనా మేలు చేయాలని ఆశిస్తున్నారు స్థానిక భగత్ వాసులు.

# బాహ్య శత్రువుల కంటే, మన అంతర్గత అహంకారాన్ని జయించడం గొప్ప విజయం : బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్





**కుత్బుల్లాపూర్, మే 12 కరపత్రం ప్రతినిధి**
130 - సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ లోని "నక్షిణ్ బుద్ధ విహార్" దేవాలయంలో నిర్వహించిన బుద్ధ జయంతి కార్యక్రమానికి సోమవారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కోపంతో కాకుండా శాంతి, సహనంతో ప్రపంచాన్ని జయించవచ్చని, బాహ్య శత్రువుల కంటే, మన అంతర్గత అహంకారాన్ని జయించడం గొప్ప విజయమని మానవాళికి దిశానిర్దేశం చేసిన గొప్ప మార్గదర్శకులు గౌతమ బుద్ధుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, బుద్ధ దేవాలయం కమిటీ అధ్యక్షులు యశ్వంత్ జోన్డేల్, ఉపాధ్యక్షులు భీమ్ రావు కాండే, ప్రధాన కార్యదర్శి దిలీప్, జే. గౌతమ్, డబ్ల్యూ. దమ్మానం, కె. బాలాజీ, నాయకులు పెద్ద వెంకట స్వామి, గుబ్బల లక్ష్మీనారాయణ, కావలి రవి, వల్లీ భాయ్, జాంగీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు...

## సాదా.. సీదాగా రోడ్డు వెంట బండి వద్ద టిఫిన్ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**12-5-2025 కరపత్రం ప్రతినిధి అశ్వారావుపేట**
హంగు ఆర్భాటానికి దూరంగా ఉంటూ.. ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమయ్యే ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి.. సోమవారం ఉదయం రోడ్డు వెంట టిఫిన్ బండి వద్ద దోస తిన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు.. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి వెళుతూ..పోలీస్ స్టేషన్ రింగ్ సెంటర్ లో ఆగారు. రోడ్డు వెంట ఉన్న టిఫిన్ బండి వద్దకు ఓ సామాన్యుడి మాదిరి గా వెళ్లి హాఫ్ దోస, సింగల్ ఇడ్లీ తినగా.. సార్ భలే సింపుల్ అంటూ స్థానికులు ఒకింత ఆశ్చర్యంగా చూశారు. అక్కడున్న.. స్థానిక ఆదివాసీ యువతను ఆప్యాయంగా పలకరించగా..వారంతా ఎంపీ తో సెల్ఫీలు తీసుకుని ఆనందించారు.